

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## (అంతర్వేదిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 20-1-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

దక్షిణ భారతదేశంలోఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో అంతర్వేది ఒకటి. కృష్ణావతారం, రామావతారం భూమిమీద చాలాకాలం ఉన్నాయి. కాని నరశింహస్వామి అవతారం ప్రహ్లాదుని రక్షించడానికి వచ్చి కొన్నిక్షణాలు వున్నాడు. భాగవతంలో చాలామంది భక్తులు వస్తారు కాని అగ్రస్థానం ప్రహ్లాదుడికి ఇచ్చారు. సంపూర్ణమైన జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం అన్ని కళ్యాణగుణాలు ఉన్నవాడినే భగవంతుడు అనిపిలుస్తారు. భగవంతుడు ఏమని చెపుతున్నాడు అంటే నేను అందరి హృదయాలలో ఆత్మగా, చైతన్యంగా ఉన్నాను. అందరి హృదయాలలో ఉండి వారి దేహప్రారబ్ధము ననుసరించి వారిని ఆడిస్తున్నాను. నిశ్శబ్దంగా పనిచేస్తున్నాను, నేను చేసే పని నీకళ్లకు కనబడదు. నీకళ్లకు కనబడనంత వేగముగా పనిచేస్తున్నాను. నీకళ్లకు కనబడటం లేదు కాబట్టి నేను లేను అని మీరు అనుకొంటున్నారు. మీదేహం ఉన్నా లేకపోయినా నేను ఉన్నాను. ఉండటమేదేవుని పేరు. ఈ జీవకోటికి మొదలునేను, మధ్యనేను, చివరనేను. అంతానేనే. శివుడు లేకుండా జీవుడు ఉండలేడు, జీవుడు లేకుండా శివుడు ఉండగలడు.

మీరు ఉత్తమభక్తులు అయితే, ఉత్తమసాధకులు అయితే మీహృదయంలో సజీవంగా ఉన్న చైతన్యాన్ని ధ్యానం చేసుకోండి, ఉపాసన చేయండి. మీమనస్సును ఆ చైతన్యం మీద నిలబెట్టి ఉంచండి. ఆ అర్హత, యోగ్యత ఉంటే డైరెక్టుగా చైతన్యమును ధ్యానం చేయండి. మీకు హృదయంలో ఉన్న ఈశ్వరుడిని ఆరాధించే శక్తి, ధ్యానించే శక్తి, ప్రేమించేశక్తి లేకపోతే రాముడినిగాని, కృష్ణుడినిగాని అవతారపురుషులను ఉపాసించటం రెండోపద్ధతి. కర్మతొందరగా ఫలానికి వస్తుంది. కర్మఫలంవచ్చినంత తేలికగా జ్ఞానఫలంరాదు. జ్ఞానఫలం మోక్షం, శాంతి. మాకు శాంతి లేదు, శాంతిలేదు అంటారు. ధనంవలన, అధికారంవలన శాంతిరాదు. ఎవడికైతే ఈసృష్టిమీద ప్రేమ ఉందో వాడికి శాంతి వస్తుంది. ఎవడికైతే అహంకారము, మమకారము,లేదో ఎవడిమనస్సు అయితే అణిగిఉందో వాడికి శాంతివస్తుంది అనిగీతలో కృష్ణుడు చెప్పాడు. ప్రేమ పెరిగేకొలది శాంతి పెరుగుతుంది. స్వార్థం పెరిగేకొలది పాపం పెరుగుతుంది. అది మనకు అర్థంకాదు. అది కంటికి కనబడని విషయం. యాగము కర్మకాండకు సంబంధించినది. యోగము మనో నిగ్రహమునకు సంబంధించినది. ఒకవ్యక్తి మహాభక్తుడు, జ్ఞాని అయ్యాడు అంటే యోగంవలన ఆస్థితికి వచ్చాడు. యోగంయొక్క ప్రయోజనం ఏమిటి అంటే జీవలక్షణాలు తగ్గాలి. మీరు ఏ యోగంలో ప్రయాణం చేసినా మీరు పోగొట్టుకోవలసింది దేహగతమైననేనునే. మీకు మోక్షం వస్తుందా, రాదా అని

కంగారుపడకండి. మీ అందరకు మోక్షం కలుగుతుంది. సందేహాలు పెట్టుకోవద్దు. అయితే కొంత ప్రయత్నం చేయాలి. మనకి ఉన్న శవబుద్ధిని పోగొట్టి శివబుద్ధిని కలగజేయటంకోసమే ఈ ప్రవచనములు. కాలమును, శక్తిని వృథా చేసుకోవద్దు, కాలమును సద్వినియోగం చేసుకోండి అని పెద్దలు చెపుతున్నారు. ఈ దేహానికి మరణం ఎప్పుడు వస్తుందో మనకు తెలియదు. దేహానికి మరణం రాకముందే దేహాభిమానం నశిస్తే నీవు జీవన్ముక్తుడుఅవుతావు. దేహానికి మరణం వచ్చేలోపు దేహాభిమానం నశించకపోతే ఈ జీవుడు ఇతర లోకాలకు ప్రయాణం చేస్తాడు. కామక్రోధములు రజోగుణంలో నుండి వస్తున్నాయి. అవి అనుభవించే కొలది పెరుగుతాయి. వాటిని తగ్గించుకోవాలా, పెంచుకోవాలా అనేది నీ ప్రయత్నంలో సాధనలో ఉంది. మహాత్ములను దర్శించటం, గురువును ఆశ్రయించటం కామక్రోధముల వేగం తగ్గించుకోవటానికే. విషయాలు, అన్నీ ఏమనస్సులో ఉన్నాయో ఆమనస్సు నశించిన తరువాత ఉన్న మనస్సు మాట్లాడుతూ ఉంటే ఆవాక్కు ఎంత నిర్మలంగా ఉంటుందో, ఎంత వైభవంగా ఉంటుందో చూడాలి అన్నారు భగవాన్. కామక్రోధములు మనస్సులో పెట్టుకొని, అహంకారము, మమకారము పెట్టుకొని మాట్లాడితే ఎవరు ఉద్ధరించబడతారు. కామక్రోధములు ఉన్న మనస్సు నశిస్తే నీవు పోతావని కంగారు పడకు ఇంకో మనస్సు కలుగుతుంది. అది నిర్మలంగా ఉంటుంది, శాంతిగా ఉంటుంది. ఆమనస్సు నీకు చేకూరినపుడు నీమాట, చూపు నిర్మలంగా ఉంటుంది. ఎదుటి మనిషిని టచ్ చేయకుండానే వాడికి జ్ఞానమును ప్రసాదించగలవు. దాని వైభవం అటువంటిది.

నీ దేహానికి భిన్నంగా, నీ ఇంద్రియాలకు భిన్నంగా, నీ మనస్సుకు భిన్నంగా, నీ బుద్ధికి భిన్నంగా చైతన్యవస్తువు ఒకటి ఉంది. అది స్వతంత్రమైనది. అది ఉండటం వలననే అది తెలియబడుతుంది. దానికి చావులేదు. పుట్టుకలేదు. దానితో తాదాత్మ్యం వచ్చినప్పడు నీకు కూడా చావులేదు అని నీకు తెలుస్తుంది. దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే జ్ఞానం దాని స్వరూపమే ఆనందం. అది తెలిసినప్పడు కదా దానివైభవం నీకు తెలిసేది. అది అంతిమస్థితి. ఈలోపుగా అది జయించాము, ఇది సాధించాము, ఒడ్డుకు వచ్చేసాము అని పిచ్చిపిచ్చి గొడవలు పెట్టుకోవద్దు అంటున్నారు. స్వాములవారు. ఓపరమేశ్వరా ! నీ మొదలు విష్ణువుకు తెలియలేదు. నీచివర బ్రహ్మకి తెలియలేదు ఇంక నీ గురించి నాకు ఏమి తెలుస్తుంది. నా మీద కరుణ, ప్రేమ కురిపించి నీవు ఎవరోనాకు తెలియపరిస్తే నేను చూడటానికి సరిపోతానుకాని నా తెలివివలన నిన్ను ఏమి తెలుసుకోగలను అని మురుగనార్ అన్నారు. డబ్బు, అధికారం యొక్క విలువ మనకు తెలుస్తోంది గాని భక్తి యొక్క విలువ మనకు తెలియటం లేదు. భక్తియొక్క విలువ తెలిస్తే దానిని సంపాదించుకోవాలనే బుద్ధి మనకు కలుగుతుంది. భక్తి యొక్క విలువ తెలియటానికే ఈ ప్రవచనములు. నీవు ప్రజలకు సేవ చేయగలిగితే మంచిదే. భౌతికంగా ప్రజలకు సేవచేసే శక్తి నీకు లేకపోతే ఇతరులపట్ల సహృదయం, సద్భావన ఉంటే అందరూ బాగుపడాలనే కాంక్ష నీకు ఉంటే అదికూడా ప్రజా సేవతో సమానమే. ఇతరులపట్ల సహృదయం కలిగిఉంటే భగవదానుభవం పొందటానికి నీకు ఏకారణములు అడ్డు

వస్తున్నాయో గురువు వాటిని బయటకులాగి మంట పెడతాడు. సహృదయాన్ని ఎప్పుడూ విడిచి పెట్టకూడదు.

గురువు మీదగాని, నీకు ఇష్టమైన దేవుని మీదగాని ఒకే వస్తువు మీద నీ మనస్సును నిలబెట్టి ఉంచటం ధ్యానం. ఒకే వస్తువు మీద నీ మనస్సును నిలబెట్టి ఉంచగా, ఉంచగా ఇతర తలంపులకు వెళ్ళే ఆహారం ఆగిపోతుంది. అప్పడు ఇతర తలంపులు అన్నీ పోతాయి. చివరకు దేవుని తలంపు ఒక్కటి మిగులుతుంది. నీవు ధ్యానించే దేవుడు నీకు అనుభవంలోనికి వచ్చాక ఈతలంపు కూడా తప్పకొంటుంది. మనం పూజచేస్తాము. జపం చేస్తాము. ధ్యానం చేస్తాము. ఇవి గమ్యంకాదు. ఇవి సాధనలు మాత్రమే. లోకం మీద ఉన్న మోహం తగ్గించుకోవటానికి మనం భగవంతుని మోహిస్తాము. మన మీద ఆయనకు దయ కలిగినపుడు ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. ఆయన స్వరూపాన్ని మనకు ఇచ్చినప్పడు ఆయన మీద ఉన్న మోహాన్ని కూడా ఆయనే పోగొడతాడు. లోకం మీద ఉన్న మోహం పోవటానికి భగవంతుని పాదాలను ఆశ్రయించాలి. నిజమైన ధ్యానం అంటే మనస్సును ఆత్మమందు లగ్నం చేయటం అని చెప్పారు. ఆత్మకు ఆకారములేదు కాబట్టి దానియందు మనస్సును నిలబెట్టటం కష్టం. అందువలన ఒక అవతారపురుషుని మీదగాని, గురువు మీదగాని నీమనస్సును నిలబెట్టి ఉంచాలి. అది ఏగమ్యానికి తీసుకొని వెళుతుందో ఇదికూడా అదే గమ్యానికి తీసుకొని వెళుతుంది. నీవు చేసే పూజ, జపం, ధ్యానం నిజమైతే నీమనస్సుకు నిగ్రహం రావాలి. నీమనస్సుకు నిగ్రహం రాకపోతే నీవు చేసే పూజ, జపం, ధ్యానం నిజంకాదు అని అర్థం. నీకు మనోనిగ్రహం కలిగితే మనస్సు నిర్మలమవుతుంది, మనస్సు అణుగుతుంది. నిజమైన మంచితనం ఉన్నచోట, నిజమైన వైరాగ్యం ఉన్నచోట మనస్సుకు నిర్మలత్వం వస్తుంది. కొంతమంది మేముమంచివారము, మాకు వైరాగ్యం ఉంది అంటారు. మీలో మీరు మంచివారము అని, వైరాగ్యం ఉంది అని అనుకొంటున్నారు అంటే మీలో నిర్మలత్వం లేదు అని అర్థం. నిర్మలత్వంలేని మాటలు, నిర్మలత్వంలేని వైరాగ్యం మీకు సహకరించవు సరికదా రజోగుణాన్ని పెంచుతాయి.

పరిస్థితులు తనకు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా ఎవడైతే లోపల నిర్మలంగా సహజంగా ఉండగలుగుతున్నాడో, తనను తాను మర్చిపోకుండా ఎవడైతే ఉండగలుగుతున్నాడో వాడు ఈసృష్టిలో అదృష్టవంతుడు. ఎందుచేతనంటేవాడు మోక్షాన్ని పొందటానికి అర్హత సంపాదించుకొంటున్నాడు. నీకు నిర్మలత్వమే లేనప్పడు నీకు శాంతి ఏమిటి? నీకు మోక్షం ఏమిటి? జ్ఞానాన్ని, దేవుడిని మీకు గురువు ఎక్కడ నుండో తెచ్చి ఇవ్వడు. నీ హృదయంలో ఉన్న దేవుడిని తెలుసుకోవటానికి ఏ విషయాలు అయితే అడ్డువస్తున్నాయో ఆ విషయాలు తీసివేసి హృదయంలో ఉన్న జ్ఞానాన్ని మీకు అందిస్తాడు వాడు గురువు. అందరి హృదయాలలో ఉండి ప్రారబ్దమునననుసరించి ఈబొమ్మలను తిప్పతున్నాను అని భగవంతుడు చెప్పాడు. నీవు వారికి శరణాగతి చెందుతాను, వీరికి శరణాగతి చెందుతాను అనే బదులు నీహృదయంలో ఉండి నిన్ను తిప్పతున్న భగవంతునికి శరణాగతి పొందితే దేహం పీడ వదిలిపోతుంది కదా అంటున్నారు స్వాములవారు. మనం ఏదైతే కాదో అందులో నుండి గాఢనిద్రలో

మనం విడిపోతున్నాము. మనం ఏదైతే అవునో అదిగా అక్కడ మనం ఉన్నాము గాఢనిద్రలో ఏవస్తువు అయితే ఉందో అది జాగ్రదావస్థలో కూడా ఉంది. కాని దానికి సంబంధించిన అనుభవం మనకు లేదు. కారణం ఏమిటి అంటే జాగ్రదావస్థలోనికి వచ్చేటప్పటికి మనస్సు వస్తోంది. మనస్సు వచ్చాక దాని వికారములు, పరిమితులు, గుణాలు అన్నీ వచ్చేస్తున్నాయి. సాధన చేసి మనస్సును నశింపచేస్తే గాఢనిద్రలో ఉన్న సుఖం జాగ్రదావస్థలో కూడా మనకు ఎరుకలోనికి వస్తుంది.

మనస్సు నశించిన తరువాత వచ్చేమాట, మనస్సు నశించిన తరువాత వచ్చే మనస్సు, మనస్సు నశించిన తరువాత వచ్చే జ్ఞానం అది ఫైనల్, అది చివరి స్థితి, పరమస్థితి అన్నారు భగవాన్. ప్రపంచంలో ఏమతానికి చెందిన వారైనా, ఏకులానికి చెందినవారైనా భగవాన్ టీచింగ్‌కు ఆకర్షింపబడతారు. ఎందుచేతనంటే ఒక కులం మీదగాని, ఒక మతంమీదగాని, ఒక దేవుడు మీదగాని ఆధారపడి చెప్పినదికాదు, ఆయన అనుభవంలో నుండి తీసి చెప్పారు. అది పరిమితం కాదు. అసత్యవస్తువుకు హద్దులు, పరిమితులు ఉంటాయి గాని సత్యవస్తువుకు ఏమి ఉండవు. మనకు ఎంతో కొంత జ్ఞానం ఉంది కాని మనకు ఉన్న జ్ఞానం పరిమితమైనది. ఈ పరిమితమైన జ్ఞానాన్ని అపరిమితం చేసి అఖండం చేస్తాడు వాడు గురువు. మనం ఎక్కడో లోపల ఉన్నాము అనుకొంటున్నాము, బయట ఎక్కడాలేము అని అనుకొంటున్నాము, లోపల ఉన్నామనే భావన మనకు ఉందికాని బయట కూడా మనం ఉన్నాము అనే విషయం మనకు తెలియటం లేదు. ఈలోపల ఉన్న నీవు, బయటా ఉన్నావు, అంతటా ఉన్నావు, అఖండముగా ఉన్నావు అని నీస్వరూపాన్ని నీకు తెలియపర్చేవాడే గురువు.

భగవాన్ దగ్గరకు ఎవరైనా వచ్చి నాకు బాధగా ఉంది, నాకు అశాంతిగా ఉంది అని అంటే నువ్వు ఉంటే అశాంతి ఉందా నువ్వు లేకపోతే ఉందా అనేవారు. నేను ఉంటేనే అశాంతి ఉంది అంటే అశాంతికి కారణం ఎవరు అంటే నేను. ఆనేను ఉంటేనే అశాంతి ఉంటుంది. ఆనేనును పోగొట్టుకొంటే ఏమీ లేదు. ఆనేను అనే మొదటి తలంపునే జీవుడు అంటారు. జీవుడు దేహం లేకుండా ఉండలేడు కాబట్టి దేహం వస్తుంది. దేహం వస్తే లోకం వస్తుంది. లోకం వస్తే దేవుడు వస్తాడు. పంచభూతములు ఉన్నప్పుడు పంచభూతములు లేనప్పుడు కూడా ఏశక్తి అయితే ఉందో అదే దేవుడు. అది మీ లోపల ఉంది, బయట ఉంది, అంతటా ఉంది. అది లేకుండా ఏదీ లేదు. మీరు పూజచేసిన, జపంచేసినా, యాగంచేసినా, ఏ దేవుడిని ఉపాసించిన, ఎన్ని జన్మలు ఎత్తిన భగవదానుభవం హృదయంలోనే కలగాలి, బయట కలుగనే కలుగదు. భగవంతుడు మాటకు, మనస్సుకు అందకపోయిన అనుభవానికి అందుతాడు. మనస్సు అణిగిపోతే తత్వం నీకు తెలుస్తుంది. తత్వం అంటే నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీవే అన్న సంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది, అంతవరకు నిన్ను మాయవిడిచి పెట్టదు.

జ్ఞానం సంపాదించాలి అని మనం అనుకొంటున్నాము. దానికోసం ప్రయత్నం చేస్తున్నాము. లోపల ఉన్న అజ్ఞానం ఏమంటోంది అంటే కోటిజన్మలనుండి నేను వస్తున్నాను ఇప్పుడు ఎక్కడికి పోతాను

నేను కదలను అంటోంది. పొమ్మని మనం అంటున్నాము. కదలను అని అజ్ఞానం అంటోంది, అక్కడ ఘర్షణ జరుగుతోంది. ఇదే సాధన, కొంతమంది మేము భక్తులము అంటారు. నిజమైన భక్తుడు నేను భక్తుడను అని అనుకోడు. నేను భక్తుడను అని అజ్ఞానం అనమంటోంది. అది అజ్ఞానం అన్న సంగతి మనకు తెలియటం లేదు. అజ్ఞానం నశింపచేయటానికి సాధన చేసేటప్పుడు గురువు సహాయం అవసరం. లేకపోతే ఆఘర్షణలో మనం ఓడిపోతాము. ఆఘర్షణలో సహాయం చేయకుండా  బంధువులు మనలను వదలివేసిన గురువు జన్మజన్మలకు వెంటాడతాడు. వాడి మీద ప్రేమలేకపోతే ప్రేమకలుగజేసుకొంటాడు. ఈ మొద్దులకా, శుద్దలకా ప్రేమకలిగేది, ప్రేమ ఎలా ఉంటుందో తెలియని మనస్సుకా ప్రేమ కలిగేది. భగవంతడు గురురూపంలో వచ్చి ఆయన మీద ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొని, మనకు సాధన చేసే శక్తిని ఆయనే ఇచ్చి మన చేత సాధన చేయించి అజ్ఞానం నశింపచేసి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. అంతా చేసేది గురువే. చివరి మెట్టులో కూడా ఆయనే సహాయంచేస్తాడు. నీకు చైతన్యం ఎరుకలోనికి వచ్చేవరకు నిన్ను వెంటాడతాడు. వాడు గురువు.

## (అంతర్వేదిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 22-1-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

మనం భగవంతుని ప్రార్థిస్తూ ఉంటే మనకు ఆయన మీద విశ్వాసం పెంచటం కోసం ఒకోసారి మన కోరికలు నెరవేరుస్తూ ఉంటాడు. కొన్ని కోరికలు నెరవేరిన తరువాత ఆయన మీద మనకు సజీవమైన విశ్వాసం కలుగుతుంది. నీవు పొందవలసిన స్థితి ఇది అని అప్పడు లోపల నుండి మనకు గైడెన్స్ ఇస్తాడు. ఈశ్వరుని అనుగ్రహం లేకుండా ఈశ్వరుని మనం పొందలేము. మనం ఏకాంతంగా ఉన్నప్పడు ఒకోసారి ఈశ్వరుడు గుర్తుకు వస్తాడు. అప్పడు ఒక్కసారిగా విషయ చింతన కూలిపోతుంది. అప్పడు ఈశ్వరుని స్మరణ నదీ ప్రవాహంలాగవస్తుంది. ఆయన అనుగ్రహం వలననే ఆయనను స్మరించగలుగుతున్నాము అని మీకు తెలియదు. జపంచేసేటప్పడు, ధ్యానంచేసేటప్పడు ఇది ఎప్పడు అయిపోతుందా అని మనకు అనిపిస్తుంది. ఎందుచేతనంటే అది సహజ స్థితి కాదు అక్కడ ప్రయత్నం ఉంది. ప్రయత్నం ఉంటే అది సహజ స్థితి కాదు. సాధన పేరు మీద బాధ లేకుండా Subject చెప్పటంలోనే చాలా దూరం మనలను తీసుకొని వెళ్ళటానికి వచ్చిన అవతారం రమణావతారం. బోధించేక్రమంలోనే జ్ఞానం దగ్గరకు తీసుకొని వెళ్ళటానికి వచ్చిన అవతారం అది.

ఎవరి అహంభావన అంటే వారికి బాగా ఇష్టం. మీ దగ్గర ఉన్న బంగారం మీద మీకు ఎంత ప్రీతి ఉందో అంతకన్న మీ అహంభావన మీద మీకు ఎక్కువ ప్రీతి ఉంది. ప్రపంచంలో అన్ని త్యాగముల కంటే గొప్ప త్యాగము ఏమిటి అంటే మీ అహంభావనను విడిచి పెట్టటమే గొప్ప త్యాగము. నువ్వు జ్ఞానగురువు అని లోకం అంతా చెప్పకొంటూ ఉంటే నీ దగ్గరకు వచ్చాను. కాని నీవు దొంగతనాలు కూడా నేర్చుకొన్నావు అని అరుణాచలేశ్వరుడితో భగవాన్ అంటున్నారు. ఎందుచేతనంటే నా అహంభావనను తొలగించుకోవటానికి నేను ఏమీ సాధన చేయలేదు. నాకు తెలియకుండా

నా అహంభావనను తొలగించావు. నాకు బాగా ఇష్టమైన అహంభావనను ఇమ్మంటే ఇవ్వను కాబట్టి దొంగతనము చేసావు. ఈ జన్మసముద్రంలో ఉండటానికి అహంభావనే కారణం. అహంభావన పోయిన వెంటనే మానవుడు ఆనంద సముద్రములో ఊగిసలాడతాడు. రోగం ఉన్నంత సేపు మందుతో పనిగాని రోగం తగ్గిన తరువాత మందుతో పనిలేదు. అలాగే అహంభావన ఉన్నంత సేపు సాధన చేయాలి, అహంభావన పోయిన తరువాత సాధనతో పనిలేదు. సాధన చేస్తూ చేస్తూ సాధనలేని స్థితికి వెళ్ళాలి.. ప్రయత్నం చేస్తూ చేస్తూ ప్రయత్నంలేని స్థితికి ఎదిగి వెళ్ళి పోవాలి. ప్రయత్నం లేని స్థితికి వెళితే అది సహజ స్థితి. ఏదో ప్రయత్నం చేస్తున్నాను. ఈ ప్రయత్నంలో నీప్రేమ లేకపోతే, నీ సహకారం లేకపోతే ఈ సాధనసాగదు. నీ ప్రేమవలననే నిన్ను పొందాలిగాని లేకపోతే నిన్ను పొందలేను అని ప్రార్ధన చెయ్యగా చెయ్యగా ప్రార్ధనా ఫలితంగా భగవంతుడు తన స్వరూపాన్ని నీకు ఇస్తాడు.

అన్ని ఉపాధులు నేనే అని అనుకోవటం వేరు, ఈ ఉపాధికే నేను పరిమితం అవ్వటం వేరు. ఇప్పుడు రమణమహర్షిగారి శరీరంలేదు. ఎవరు నన్ను ప్రేమిస్తారు, అని అనుకోవద్దు. శరీరం లేదు కాబట్టి ఆయనకు మనకు అడ్డు లేకుండా పోయింది. శరీరం ఉంటే శరీర ధర్మాన్ని బట్టి కొన్ని గౌరవాలు; మర్యాదలు ఉంటాయి. శరీరం ఉంటే ఏదో రకంగా అడ్డు. శరీరం లేదు అంటే ఆయనకు మనకు అడ్డులేకుండా పోయింది. మనకు ఎంత సేపు ఈశరీరాలను మోయటమే పని కాబట్టి ఈ విషయం మనకు తెలియటం లేదు. ఈ శవాన్ని అలంకరించటంలోనే చాలా కాలం వెళ్ళి పోతుంది. బాగా పక్వానికి వచ్చిన వారికి లోపల ఉన్న ఈశ్వరుడే జ్ఞానజ్యోతిగా ప్రకాశించి సత్యమైన జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. బాహ్యమైన గురువుతో సంబంధంలేదు. బాహ్యగురువు అవసరం లేకుండా అందరికి జ్ఞానం వస్తుంది. అని చెప్పలేము, అలాగని జ్ఞానం రాదు అని చెప్పలేము బాగా పక్వానికి వచ్చిన కొంతమందికి బాహ్య గురువు అవసరం లేకుండా జ్ఞానం రావచ్చును. మన మనస్సు నిర్మలంగా ఉంటే, నిశ్చలంగా ఉంటే, అణిగిఉంటే మన కళ్ళకు కనిపించే ఈ సృష్టిలో ఎన్ని అయితే రహస్యాలు ఉన్నాయో ఆరహస్యాలను ప్రకృతి మనకు చెపుతుంది.

నీకు నచ్చిన వ్యక్తిని గురువుగా తీసుకో. నీమనస్సు అక్కడ నిర్మలం అవ్వాలి నీమనస్సు ఎవడితో శృతి కలుపుతోందో వాడే నీ గురువు. ఆధ్యాత్మికం అంటే సామాన్యం అనుకోవద్దు. భౌతిక జ్ఞానం ఎక్కడయితే ముగుస్తుందో ఆధ్యాత్మిక జ్ఞానం అక్కడ ప్రారంభమవుతుంది అని రాధాకృష్ణన్ చెప్పారు. మీ సాధన ఏదో మీరు తీవ్రంగా చేసుకొంటూ వెళ్ళండి. వెనకాల విమర్శలు వస్తూఉంటాయి, పొగడ్తలు వస్తూఉంటాయి. మీ మనస్సును అటుపెట్టవద్దు. గమ్యం చేరేవరకూ మీ ప్రయాణం ఆపవద్దు, విడిచి పెట్టవద్దు.